క్లుప్తంగా

పీహెచ్‌సీకి కుర్చీల బహూకరణ



కొమరవోలు(పామర్రు): కొమరవోలు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి దాతల సహకారంతో పలు ఉపకరణాలను మంగళవారం అందజేశారు. గుడివాడకు చెందిన వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో డాన్ టు డాస్క్ కార్యక్రమంలో భాగంగా గోళ్ల నాగేశ్వరరావు సూచనల మేరకు ఆరోగ్య ఉప కేంద్రానికి నాలుగు కుర్చీలు, ఒక టేబుల్‌ను బహూకరించారు. దాత శేగు లలిత చేతులు మీదుగా ఈ ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం

పామర్రు: మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా నగదును మంగళవారం అందజేశారు. స్థానిక కోటిరెడ్డి పేట మూడవ సిగ్మెంట్ 9వ వార్డులో ని వైఎస్సార్ సీపీ నాయకులు శీలం వెంకటేశ్వరరావు ఈనెల 24వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ బీమా రూ.లక్షలు మంజూరు కాగా ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు మృతుడి కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, వార్డు మెంబరు తాడిశెట్టి కుమార్‌ల చేతుల మీదుగా అందజేశారు. మండల వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆర్‌బీకేల చైర్మన్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వార్డు మెంబర్లు కోటయ్య, ఆరేపల్లి శ్రీహరి, యార్లగడ్డ శ్రీను, కూతాడి రవి, ముస్లిం నాయకులు హుస్సేన్, కాలిక్ బాబు, ఎస్టీ నాయకులు సజ్జా సుబ్రమణ్యం, మండల టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకర్ల శివ శంకర్, జొన్న లక్ష్మీనారాయణ, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి



ముదినేపల్లి రూరల్ : ఉపాధ్యాయులు తమకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వహించాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని చేవూరు ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ మంగళవారం తనిఖీ చేశారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. వీటిని విద్యార్థులకు నూరుశాతం వర్తింపచేయడంతో పాటు హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థుల మానసిక సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన నరేష్‌కుమార్‌ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



ముదినేపల్లి రూరల్ : స్థానిక మూడో బజారులో సోమవారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఉప్పల సీతారామయ్య కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా హఠాత్తుగా మంటలు చెలరేగాయి. మంటల వేడికి మేలుకున్న సీతారామయ్య కుటుంబ సభ్యులతో ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. బాధితులు కట్టుబట్టలతో బయటపడ్డారు. ప్రమాదానికి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు.

దివ్యాంగులకు సేవలు అభినందనీయం



ఎలకుర్రు(పామర్రు): దివ్యాంగులకు ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని దివ్యాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వీ కామరాజు అన్నారు. మండల పరిధిలోని ఎలకుర్రు గ్రామంలో కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా 'హెలెన్ కెల్లర్' డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కామరాజు మాట్లాడుతూ మానసిక స్థైర్యం ఉంటే ఏదగడానికి ఏదీ అడ్డు కావని అన్నారు. తల్లిదండ్రులు నిరాశా నిస్పృహలకు లోను కాకుండా తమ పిల్లలకు శిక్షణ ఇప్పించి వారి జీవితాలు వెలుగు బాటలో పయనించే విధంగా కృషి చేయాలని అన్నారు. టచ్ థెరఫీలను అందిస్తున్న కేడీబీ ట్రస్టు సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం చిన్నారులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేడీబీ ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు, సిబ్బంది దివ్యాంగులైన చిన్నారులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డీఎన్నార్



సానారుద్రవరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు (కలిదిండి): గ్రామీణ ప్రాంత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం సానారుద్రవరంలో గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విడుదల చేసిన నిధులతో అత్యవసర పనులను చేపడుతున్నట్టు డీఎన్నార్ చెప్పారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులకు కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అన్ని రంగాలకు సమ ప్రధాన్యం ఇవ్వడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, సేవలు ఏ ఒక్కరికీ దూరం కాకూడదనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సచివాలయాల ద్వారా ప్రజలకు అందాల్సిన 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. అర్హత ఉండీ పథకాలు అందనివారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటారని ఆయన చెప్పారు. ఇంత చిత్తశుద్ధితో పనిచేసే సీఎంకు అండగా ఉండాలన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనులు పూర్తిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి నున్న రాజ్యలక్ష్మి, కలిదిండి ఏఎంసీ చైర్మన్ ఐనాల బ్రహ్మాజీరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని పార్థసారథి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, నాయకులు ఊరా శ్రీధర్, నున్న భగవాన్, కృష్ణ బాబు, గొర్ల వెంకటేశ్వరరావు, నీలపాల భోగేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయాలి



పెదపాలపర్రు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ముదినేపల్లి రూరల్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.మల్లీశ్వరి కోరారు. మండలంలోని పెదపాలపర్రులో ఈ పథకాన్ని మంగళవారం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. దీనిపై అవగాహన కల్పించేందుకు మండలంలోని అన్ని సచివాలయాల వలంటీర్లు, ఉద్యోగులు, సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికీ జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రభుత్వం చేపడుతున్న పథకాలు చేరేలా చూడాలన్నారు. కుల,, జనన, మరణ ధ్రువపత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, రేషన్ కార్డుల సవరణ, పింఛన్లు, రైతులకు సంబంధించిన పలు సమస్యలు పరిష్కరించి ప్రజలకు చేరువ కావాలని అన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ టి.విజయసారధి, సచివాలయాల కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: జగనన్న సురక్ష కార్యక్రమంపై కార్యదర్శులు, వీఆర్వోలకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టీకే వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులు అందరికీ పథకాలు సక్రమంగా అందించేందుకే ఈ పథకాన్ని రూపొందించినట్టు చెప్పారు. ఏ కారణం చేతైనా పథకం అందని వారి జాబితా తయారు చేసి వారికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ బి.ఆనందబాబు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం అవసరం



అమరావతిలో పాఠశాల కమిటీ సమావేశం

కైకలూరు (కలిదిండి): గ్రామంలో పాఠశాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని అమరావతి సర్పంచి పి.భోగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం హెచ్‌ఎం ఎఎస్ఎన్ బెనర్జీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. భోగేశ్వరరావు మాట్లాడుతూ దొంగలు దోచుకోలేనిది, ఎంత పంచినా తరగని ఆస్తి విద్య మాత్రమే అని చెప్పారు. సమావేశంలో సంతోషపురం గ్రామ సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ పవన్ కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ టి.సతీష్ బాబు, ఎఎన్ఎం.పుష్పావతి, ఎమ్ఎల్‌హెచ్‌పీ దివ్య తేజ, మహిళా పోలీస్ ఆషా, పాఠశాల సిబ్బంది ఎస్.ఝాన్సి, వై.రాజేంద్రప్రసాద్, టి.పాపాయమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైనికుల సంక్షేమానికి రూ. 12.12 లక్షల చెక్కు అందజేత

మహిళా సంఘ సభ్యులకు కలెక్టర్ రాజాబాబు అభినందన



సైనిక సంక్షేమాధికారికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్, మహిళా సమాఖ్య సభ్యులు

చిలకలపూడి(మచిలీపట్నం): సైనికుల సంక్షేమానికి సామాజిక బాధ్యతగా జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఒక్కొక్కరు రూ. 5 చొప్పున రూ. 12,12,667 సేకరించారు. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమాధికారి కల్యాణ వీణకు మంగళవారం అందించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలను పణంగా పెట్టి కృషి చేస్తున్న సైనికుల సంక్షేమానికి మహిళా సంఘాలు విరాళాలు సేకరించి ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాల్లో ప్రగతి సాధించేలా ఏపీఎంలు బాధ్యత తీసుకోవాలన్నారు. సంఘాల్లో సభ్యులైన లబ్ధిదారులకు రూ. 35 వేల చొప్పున నిర్మాణానికి రుణాలు అందించామని, వారంతా ఇళ్ల నిర్మాణం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల్లో ప్రతి ఒక్కరూ వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందేలా యానిమేటర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు టి. నాగమునెమ్మ, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా పలు చట్టాలు

న్యాయవాది సోమశేఖర్

బంటుమిల్లి: వయోవృద్ధులు, తల్లిదండ్రుల సంక్షేమానికి అనేక చట్టాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల సోమశేఖర్ (శ్యాంబాబు) అన్నారు. వృద్ధుల వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వయోవృద్ధులు, తల్లిదండ్రుల సంరక్షణకు తయారు చేసిన చట్టాలను వివరించారు. పేదలైన తల్లిదండ్రులు, వృద్ధులు ఉంటే ఎటువంటి ఫీజు లేకుండా బంటుమిల్లి బార్ అసోసియేషన్ ఉచితంగా సేవలందిస్తోందని చెప్పారు. వయోవృద్ధులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, దాని ద్వారా పిల్లల నుండి భరణం, రక్షణ పొందవచ్చని చెప్పారు. వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం సాయం కోసం హెల్పేజ్ ఇండియా టోల్‌ఫ్రీ నెం: 14567ను రూపొందించిందని, బాధితులు ఈ నెంబర్ ద్వారా అధికారులకు ఫోన్ చేసి సాయం పొందవచ్చని వివరించారు. సంఘం అధ్యక్షుడు సీహెచ్ గంగాజలరావు, కార్యదర్శులు ఎస్. జనార్దన్‌రావు, కె. నాగభూషణం, జె. భాస్కరరావు, సభ్యులు పి. పద్మనాభరావు, జి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

పెడన: జాతీయ రహదారి పక్కన తాళం వేసి ఉన్న ఇంట్లోకి దొంగలు ప్రవేశించి చోరీ చేశారు. ఈ ఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శింగరాయపాలెం గ్రామానికి చెందిన అనుమకొండ బాలకృష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బాలకృష్ణ ఇల్లు 216 జాతీయ రహదారి పక్కన ఉంది. బాలకృష్ణ తల్లిదండ్రులు ఇటీవలే మృతిచెందడంతో నెలరోజులు వరకు వర్క్ ఫ్రం హోం చేస్తూ ఇంటి వద్దే ఉన్నాడు. వర్క్ ఫ్రం హోం ముగియడంతో నెల కిందట ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. ఇంటి తాళాలను స్థానికంగా ఉండే బంధువులకు అప్పగించాడు. బాలకృష్ణ బంధువులు రహదారిపై ఆటోలో వెళ్తూ ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండటాన్ని మంగళవారం గమనించి తాళం ఉన్న వారికి సమాచారం ఇచ్చారు. వారిరువురు వచ్చి ఇంటిని పరిశీలించారు. ఇంటి ప్రధాన ద్వారం వద్ద గడియ పగలగొట్టి ఉంది. బీరువాలోని వస్తువులు, ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడవేసి ఉన్నాయి. వీరు వెంటనే పోలీసులకు, ఇంటి యజమాని బాలకృష్ణకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బంగారం, వెండి వస్తువులతో పాటు కొంత నగదు పోయినట్లు సమాచారం.

ప్రభుత్వ బడుల్లో ఉత్తమ బోధన

కోనేరుసెంటర్: ప్రభుత్వ బడుల్లో ఉత్తమ విద్యా బోధన జరుగుతోందని పెదపట్నం సర్పంచ్ గడిదేసి అనూష అన్నారు. పెదపట్నం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత విద్య అభ్యసించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. పిల్లలకు ఉత్తమ బోధన అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ బాల జేసు మాట్లాడుతూ బడులు బాగుపడాలన్నా, బడిలో పిల్లలు బాగుపడాలన్నా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సమన్వయం అవసరమని చెప్పారు. ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



కైకలూరు: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్థానిక బుడా సాహెబ్ ట్రస్ట్ సహకారంతో విద్యాంజలి డిగ్రీ కాలేజీ వద్ద రెండు లేడీస్ సైకిల్స్‌ను సర్పంచి దానం మేరీ నవరత్నకుమారి మంగళవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ గాలిబ్‌బాబు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 తరగతిలో అత్యాధిక మార్కులు సాధించిన బాలికలు మారడాని అశ్విని (564), పందిరిపల్లి శ్యామల (562)కు సైకిళ్లు అందించారు. కార్యక్రమంలో విద్యాంజలి కాలేజీ ప్రిన్సిపాల్ జమీల్ అహ్మద్, ఉపాధ్యాయుడు డి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



నడకుదురు(చల్లపల్లి): గ్రామంలో 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గొడపాలెం ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టామని నడకుదురు సర్పంచ్ గొరిపర్తి సురేష్‌బాబు అన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మంజూరు చేసిన నిధులు రూ.10 లక్షలతో నడకుదురు గొడపాలెం ప్రధాన రహదారి నిర్మాణ పనులను సర్పంచ్ సురేష్‌బాబు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి హరిబాబు, వార్డు సభ్యురాలు జంపాన కోటేశ్వరమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కృష్ణా వీసీకి బీసీ సంఘం నేతల సన్మానం



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి రామ్మోహనరావును కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం సన్మానించారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సకాలంలో మార్కుల లిస్టును అందజేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఇటీవల వీసీకి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన వీసీ డిగ్రీ విద్యార్థులకు వెంటనే మార్పు లిస్టులు అందజేసేలా చర్యలు తీసుకున్నారు. తమ అభ్యర్థనపై వెంటనే స్పందించిన వీసీని అభినందిస్తూ సంఘ నాయకులు ఆయనను సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షుడు తోట బాబు, సంఘ సభ్యులు విశ్వనాథపల్లి సుబ్రహ్మణ్యం, పొట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు సాగు హక్కుపత్రాలు పొందాలి



పామర్రులో సాగు హక్కు పత్రాలను అందజేస్తున్న ఏవో శివనాగరాణి, తదితరులు

పామర్రు: కౌలు రైతులు అందరూ పంట సాగు హక్కు పత్రాలు తీసుకోవాలని ఏవో శివనాగరాణి అన్నారు. మంగళవారం పామర్రులోని రైతు భరోసా కేంద్రం వద్ద భూమిలేని కౌలు రైతులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల బాగుకు ఎన్నో కొత్త కొత్త పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. పంట అమ్ముకోవడానికి, పంట నష్ట పరిహారం పొందేందుకు, పంటల బీమా, రైతుల పెట్టుబడి సాయం తదితరాలు కౌలు రైతులకే దక్కాలనే ఉద్దేశంతో సీసీఆర్‌సీ కార్డులను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. ఎస్సీ, బీసీ మైనార్టీ వారు రైతు భరోసా పెట్టుబడి సాయం పొందవచ్చన్నారు. సాగుపత్రం ఇప్పించటం వలన భూ యజమానికి ఎటువంటి నష్టము జరగదని అన్నారు. పంట సాగు హక్కు పత్రం కాల పరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. మండల ఆర్‌బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, రైతులు ఆరుమళ్ల సత్తిరెడ్డి, రాజులపాటి శ్రీను, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, ఆకుల ఆంజనేయులు, దక్షిణామూర్తి, బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, వీఆర్వోలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

హౌసింగ్ డీఈ రామోజీనాయక్



చౌటపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ రామోజీనాయక్

గుడివాడరూరల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ ఎం.రామోజీనాయక్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్‌శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. తొలుత గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు అందజేస్తున్న మెటీరియల్, ఇతర విషయాల గురించి లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులు వీలైనంత త్వరగా స్లాబ్ వేసే విధంగా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు ఎవరైనా ఉంటే ఆ లబ్ధిదారులకు అర్థమయ్యే రీతిలో వివరించి ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టి పూర్తి అయ్యేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌ఛార్జి హౌసింగ్ ఏఈ పృథ్వీ, సచివాలయ ఉద్యోగులు, గృహ నిర్మాణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే కృషి



భూమిపూజ చేస్తున్న శశిభూషణ్

గుడివాడ టౌన్: పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్ని విధాలా కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. స్థానిక బేతవోలు 28వ వార్డు ఇందిరా నగర్ కాలనీలో నూతనంగా రూ.60 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నా ప్రతిపక్ష నాయకులు దిగజారుడు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇందిరానగర్ కాలనీకి సంబంధించి 25 ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను ఈ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కొడాలి నాని చొరవతో పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కె.గణపతి, వీరిశెట్టి నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు రూ.1.23 కోట్ల సబ్సిడీ



వీఎఫ్ఏల సమావేశంలో మాట్లాడుతున్న ఫిషరీస్ ఏడీ షేక్ చాంద్‌బాషా

మండవల్లి: మండలంలోని 1151 మంది ఆక్వా రైతులకు రూ.1,23,91,000 సబ్సిడీ అందజేసినట్టు మత్స్యశాఖ ఏడీ షేక్ చాంద్ బాషా తెలిపారు. మండవల్లి మత్స్యశాఖ కార్యాలయంలో వీఎఫ్ఏలతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆక్వాజోన్‌లో ఉన్న రైతులు మాత్రమే సబ్సిడీకి అర్హులన్నారు. రెండు వేల మంది ఆక్వా రైతుల్లో 1,151 మంది మాత్రమే అవసరమైన సమాచారం అందజేసి సబ్సిడీ పొందినట్టు చెప్పారు. మిగిలిన రైతులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్, విద్యుత్ బిల్లులు అందజేసి సబ్సిడీ పొందాలని సూచించారు. ఆర్‌బీకే కేంద్రాల్లో ఆక్వా రైతులకు సమావేశాలు నిర్వహించి, రైతుల సమస్యలు పరిష్కరించేందుకు తగు సూచనలు అందజేయనున్నట్టు చెప్పారు. మండవల్లి మత్స్యశాఖాధికారి శ్రీనివాసరావు, వీఎఫ్ఏలు పాల్గొన్నారు.

• శ్మశాన వాటిక రోడ్డు నాడు-నేడు



నాడు అధ్వానంగా మట్టి రోడ్డు



నేడు గ్రావెల్ రోడ్డు

నందివాడ మండలం కుదరవల్లి గ్రామంలో ఎస్సీల శ్మశాన వాటికకు రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మండల ప్రజా పరిషత్ నిధులు రూ.2.8 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ఎస్సీలకు శ్మశాన వాటికకు వెళ్లేందుకు మట్టిరోడ్డే శరణ్యం అయింది. దీంతో వర్షాకాలంలో అంతిమ యాత్రకు బురద రోడ్డులో స్థానికులు నానా ఇబ్బందులు పడే పరిస్థితి. సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా మండల పరిషత్ నిధుల నుంచి రోడ్డు నిర్మించాలని ఆదేశించారు. ఆ మేరకు నిధులు మంజూరు చేసిన అధికారులు పనులు కూడా పూర్తి చేశారు. దీంతో శ్మశానానికి వెళ్లేందుకు దారి సమస్య తీరింది.

–గుడివాడ టౌన్(నందివాడ)

నిందితుల అరెస్ట్

ఉంగుటూరు: గొర్రెలు, మేకలను అపహరించిన వ్యక్తులపై ఉంగుటూరు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తరిగొప్పలకు చెందిన బొకినాల ప్రేమానందం, నిమ్మకూరు కిషోర్‌బాబులకు చెందిన మేకలు, గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం రాత్రి కొందరు యువకులు మానికొండలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో వారిని విచారించగా వారు తరిగొప్పలలో రూ.50 వేల విలువగల గొర్రెలు, మేకల చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. నిందితులు గన్నవరం మండలం బీబీ గూడెంకు చెందిన కిరణ్, దినేష్, వడ్డీకాసులుగా గుర్తించారు. అపహరించిన గొర్రెలు, మేకలను స్వాధీనం చేసుకున్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



పెనమలూరు: పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని ఏపీ నవరత్నాల అమలు కమిటీ చైర్మన్ అంకంరెడ్డి నాగనారాయణమూర్తి సూచించారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధి పోరంకిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. పేద వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని, వాటిపై అవగాహన కల్పించాలని నారాయణమూర్తి సూచించారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా గర్వంగా ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో జగనన్న ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని, గత ప్రభుత్వంలా ప్రజలను మోసం చేయలేదని వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యేలా ఉద్యోగులు, వలంటీర్లు కృషి చేసి ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మంచినేని రమేష్, నల్లమోతు జీవన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.